సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం, 29, జూన్, 2023



పోచమ్మకు బోనాలు

వేములవాడరూరల్: వేములవాడ మండలం వట్టెంల గ్రామ ముదిరాజ్‌లు బుధవారం పోచమ్మకు బోనాలు తీశారు. సర్పంచ్ యామ సుమతి, కుల పెద్దలు పాల్గొన్నారు.



అధిక ఫీజులు అరికట్టాలి

సిరిసిల్లటౌన్: ప్రైవేటు విద్యాసంస్థలో ఫీజుల దోపిడీని అరికట్టాలని జీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. బుధవారం డీఈవోకు వినతిపత్రం ఇచ్చారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/26.0

ఆకాశం మేఘావృతమవుతుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. పొగమంచు కమ్మేస్తుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది.

ముంపు ముప్పు..

- కొద్దిపాటి వర్షాలకే రోడ్లు జలమయం
- నాలాలు ఒక్కోచోట ఒక్కోలా..
- ఎప్పటిలాగే ఈసారి కూడా ప్రమాదమంటున్న ప్రజలు
- ఏటా మునుగుతున్న మంథని, గోదావరిఖని

వర్షాకాలం మొదలైంది. ఎప్పటిలాగే ముంపు ప్రాంతాల ప్రజల్లోనూ భయం పట్టుకుంది. చిన్నపాటి వర్షం కురిసినా నాలాలు పొంగడం.. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లన్నీ నీటమునగడం ఏటా జరుగుతుండడమే వారి భయానికి కారణం. అధికారయంత్రాంగం నిర్లక్ష్యం వీడకపోవడం.. నాలాలను పట్టించుకోకపోవడంతో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పొంగిపొర్లనున్నాయి. నాలాలు ఒక్కోచోట ఒకలా చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్



గతేదాది జలమయమైన రాంనగర్ ప్రాంతం

చిన్న వానకే కరీం'నగరం' జలమయం..

- కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చాలాచోట్ల ప్రధాన రహదారులు, కాలనీలు చిన్నపాటి వర్షాలకే జలమయం అవుతున్నాయి.
- నగరంలోని రాంనగర్, మంకమ్మతోట, విద్యానగర్, భాగ్యనగర్, ఆర్టీసీ వర్క్‌షాప్, సూర్యనగర్, జ్యోతినగర్, ముకరంపుర, తిరుమల్‌నగర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలు గతంలో ముంపునకు గురయ్యాయి.
- నగరం ఎగువ భాగమైన శాతవాహన యూనివర్సిటీ ఏరియా, విద్యానగర్, రాంనగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ తదితర ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీరు, వరదనీరు భాగ్యనగర్, మంకమ్మతోట, జ్యోతినగర్, ముకరంపుర, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్ మీదుగా దిగువ ప్రాంతానికి చేరుతుంటాయి. ఈ ప్రాంతాల్లోని డ్రైనేజీలు, నాలాలు ఒక్కచోట 6 నుంచి 8 ఫీట్ల వెడల్పు ఉంటే, మరోచోట డ్రైనేజీ సామర్థ్యం 2 నుంచి 4 ఫీట్లే.
- చాలా చోట్ల డ్రైనేజీల్లో ప్లాస్టిక్, భవన నిర్మాణ వ్యర్థాలు వేయడంతో మూసుకుపోతున్నాయి.
- ఎప్పటికప్పుడు నాలాలు, డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించకపోవడం, వర్షాకాలం వచ్చాక హడావుడిగా పనులు చేపడుతుండడంతో అనుకున్న మేర లక్ష్యం నెరవేరడం లేదు.
- అంబేద్కర్ స్టేడియం ముందు ప్రధాన నాలాపై డ్రైనేజీ నిర్మించడంతో గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాలు మాత్రం ముంపు బారి నుంచి బయటపడ్డాయి.
- నగరంలోని ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ ఈ నాలా గుండా లక్ష్మీనగర్ వైపు వెళుతుంది.
- రాంనగర్, సంతోష్‌నగర్‌లో పరిస్థితిలో కాస్త మార్పు కనిపిస్తున్నా భారీ వర్షాలు కురిస్తే అసలు విషయం తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు.
- పద్మనగర్, రాంనగర్, సంతోష్‌నగర్ నుంచి వచ్చే డ్రైనేజీ నీళ్లు కలిసే కల్వర్టును పెద్దగా నిర్మించారు. ఇది ఏ మేరకు ఫలితాన్నిస్తుందనేది భారీ వర్షాలు పడితే గాని తెలియదు.

ముంపు సమస్య తొలగించాలి



వర్షాకాలం వచ్చిందంటే మా ప్రాంతం ముంపునకు గురవుతుంది. టూటౌన్ పోలీసు స్టేషన్ పక్కనున్న నాలా నిర్వహణ లేకపోవడంతో వరదనీళ్ళు ఇండ్లల్లోకి వస్తున్నాయి. ఇటీవల సిల్ట్ తీసారు. సైడ్ వాల్స్ నిర్మిస్తామంటున్నారు. కాని శ్లాబ్ నిర్మిస్తే మాకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

– బి.శ్రీనివాస్, ముకరంపుర

- జ్యోతినగర్ సంతోషిమాత దేవాలయం వెనుకాల డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఇక ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ముంపునకు చేరువలోనే ఉంది.
- టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన నాలా నిర్వహణ లోపంతో సమీపంలోని ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఇక్కడ నాలాపై స్లాబ్ నిర్మిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదంటున్నారు స్థానికులు.

సిరిసిల్లను వెంటాడుతున్న వరదలు



గతేడాది పాతబస్టాండును ముంచెత్తిన వరద

- సిరిసిల్ల బల్దియాలో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగుతున్నాయి.
- కార్గిల్‌లేక్, రాయించెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువులకు చెందిన దాదాపు 20 నాలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి.
- వర్షాలు కురిసి ఈ చెరువులు నిండి మత్తడి దూకి లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తుతోంది.
- నాలాలు కబ్జా అవుతున్నాయని స్థానికులు ఆందోళనలు చేపట్టగా వరద ముంపు లేకుండా చేస్తామని అధికారులు, పాలకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చడం లేదు.
- సాయినగర్ నుంచి శాంతినగర్‌కు వచ్చే ప్రధాన మురికికాల్వలో పేరుకుపోయిన పూడికను తొలగించాల్సి ఉంది.
- వెంకంపేట ప్రాంతంలో చేపట్టిన డ్రైనేజీ, సీసీరోడ్లు పూర్తయితేనే వరదలు తగ్గే అవకాశం ఉంది.
- కొత్తచెరువు నుంచి వచ్చే వరదనీరు శ్రీనగర్ కాలనీని ముంచెత్తకుండా బైపాస్‌రోడ్డు వరకు పెద్దకాల్వను నిర్మించాలి.
- పట్టణంలో వరదలు రాకుండా రూ.2.50 కోట్లతో పనులు ఏడాది కాలంగా కొనసాగుతున్నాయి.

పెద్దపల్లిలో కరకట్ట కట్టాల్సిందే..

- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల బ్యాక్‌వాటర్‌తో గతేడాది గోదావరిఖని, మంథని పూర్తిగా నీటమునిగాయి.
- ఎల్లంపల్లి నుంచి మేడిగడ్డ వరకు ప్రతి 30 నుంచి 40 కిలోమీటర్లకో బ్యారేజీ నిర్మించారు. గతేడాది కురిసిన వర్షాలకు మహారాష్ట్ర నుంచి కూడా భారీగా వరద నీరు పోటెత్తింది.
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీల బ్యాక్‌వాటర్ గోదావరిఖనిలోని మల్కాపూర్, సప్తగిరికాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డి కాలనీ, రఘుపతిరావ్‌నగర్‌ను ముంచెత్తింది.
- అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో మంథనిలోని మంత్రివాడ, వాగుగడ్డ, బోయినీపేట, లైన్‌గడ్డ, దొంతుల వాడ, భగత్‌నగర్, చాకలివాడ, మంగలివాడ, దుబ్బగూడెం, ఎస్సీకాలనీ, అంబేద్కర్‌నగర్ నీటమునిగాయి.
- గోదావరి ఒడ్డున 8 కిలోమీటర్ల మేర సుందిళ్ల వరకు కరకట్ట నిర్మించారు. రామగుండం వరకు మరో 5కిలోమీటర్ల మేర కరకట్టకు రూ.110 కోట్లతో అంచనాలు సిద్ధం చేసినా కార్యరూపం దాల్చలేదు.



వరదలతో నీట మునిగిన గోదావరిఖని (ఫైల్)

కరకట్టతోనే పరిష్కారం



కాళేశ్వరం నిర్మాణ సమయంలో ల్యాడర్ సర్వే చేసినప్పుడే గోదావరిఖనిలోని పలు ప్రాంతాలు మునుగుతాయని తేలింది. నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని సూచించారు. సుందిళ్ల వరకు మాత్రమే నిర్మించి వదిలేశారు. రామగుండం వరకు మరో 5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

– మద్దెల దినేష్, సీపీఐ నాయకుడు గోదావరిఖని

వర్షమొస్తే భయమే



గతేడాది బొక్కలవాగు ద్వారా వచ్చిన నీరు ఇళ్లలోకి చేరి సర్వం కోల్పోయాం. కనీసం పలుకరించిన వారు లేరు. ముంపు నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆనాడు నీటిపారుదల శాఖ అధికారులు మమ్మల్ని అప్రమత్తం చేస్తే నష్టపోయేవాళ్లం కాదు.

– దొంతుల రాజలింగయ్య, దొంతులవాడ, మంథని

జగిత్యాలలో తెగిపోతున్న సంబంధాలు



గోవిందుపల్లి-వెంకటాద్రినగర్ కల్వర్టు (ఫైల్)

- స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న జగిత్యాలలో 1.30 లక్షల జనాభా ఉన్నా.. డ్రైనేజీ సమస్య మాత్రం తీరడం లేదు.
- వర్షాకాలం వచ్చిందంటే ఇందిరానగర్, గాంధీనగర్, జెండామహెళ, తీన్‌ఖని, గోవిందుపల్లి, వెంకటాద్రినగర్, సవురాల కాలనీ, చిలుకవాడ, బైపాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది.

ఎక్కడి వాళ్లు అక్కడే



వెంకటాద్రినగర్, గోవిందుపల్లి మధ్య కల్వర్టు గట్టి వాన పడితే నీట మునుగుతుంది. బాహ్యాప్రపంచానికి సంబంధాలు తెగిపోతాయి. భారీ వర్షం పడితే రోజులతరబడి ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి. హైలెవల్ కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– గోపి లక్ష్మణ్, వెంకటాద్రినగర్

ఇళ్లలోకి నీరు



పట్టణంలోని కృష్ణానగర్ నుంచి నీరు వెళ్లడానికి డ్రెయినేజీ వ్యవస్థ లేక చినుకు పడితే చాలు మురికి నీరు, వరదనీరు ఇళ్లలోకి చేరుతోంది. డైవర్షన్ నాలాలు నిర్మించి నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

– కాసారపు సుజాత, కృష్ణానగర్, 20వ వార్డు

యావర్‌రోడ్‌లో డ్రెయినేజీ నిర్మించండి



20వ వార్డులో నాలాలు సరిగా లేక చిన్నవర్షానికే కాలనీ రోడ్లతో పాటు, ఇళ్లలోకి వరదనీరు ప్రవహిస్తోంది. యావర్‌రోడ్ వెంట డ్రెయినేజీ నిర్మించి 20వ వార్డులోని కృష్ణానగర్‌లో ఇళ్లలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.

– అనుమల్ల కృష్ణహరి, 20వ వార్డు కౌన్సిలర్

న్యూస్‌రీల్

కోర్టుకు హాజరైన జనశక్తి నేత కూర రాజన్న



సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న బుధవారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన మాజీ సర్పంచ్ ఏనుగు ప్రభాకర్‌రావు అలియాస్ వేణుగోపాల్‌రావు హత్య కేసులో రాజన్న విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ చంచల్‌గూడా జైలులో ఉన్న జనశక్తి రాష్ట్ర నాయకుడు విశ్వనాథ్ కూడా పోలీసు రక్షణతో కోర్టు విచారణకు హాజరయ్యారు. ప్రభాకర్‌రావు హత్య కేసులో నిందితులుగా ఉన్న మానుక కుంటయ్య(తిప్పాపూర్), ఎక్కలదేవి మల్లేశం(మల్కాపేట), లక్ష్మణ్(ధర్మారం) కోర్టు విచారణకు వచ్చారు. కేసు విచారణ జూలై 12కు వాయిదా పడింది. ఇప్పటికే సాక్షుల విచారణ పూర్తయింది. కూర రాజన్నను పాతమిత్రులు కలుసుకుని మాట్లాడారు.

ప్రవాసీ బీమాతోనే ధీమా



కోనరావుపేట(వేములవాడ): గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికులు తప్పనిసరిగా ప్రవాసీబీమా చేయించుకోవాలని గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్ కోరారు. గల్ఫ్ వలసలపై అవగాహన, చైతన్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్కాపేటలో గల్ఫ్ కార్మిక కుటుంబాలతో సమావేశమయ్యారు. జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తోట ధర్మేందర్, నాయకులు నాగురి సమ్మయ్య, ప్రశాంత్, ఒగ్గు ప్రభాకర్, ఆకుల నాగరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిరిసిల్లటౌన్: వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు సూచించారు. తన కార్యాలయంలో బుధవారం పీహెచ్‌సీల నోడల్ పర్సన్స్, సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు నిత్యం డ్రైడే పాటించేలా చైతన్యవంతం చేయాలని సూచించారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను పరిచయం చేయాలి

వేములవాడఅర్బన్: విద్యార్థులకు సాంకేతికతను పరిచయం చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి పద్మజ తెలిపారు. వేములవాడలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు కంప్యూటర్‌ను వినియోగిస్తున్న తీరును బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం చిన్న పట్టణాలు, గ్రామీణస్థాయి విద్యార్థులకు విద్యపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్‌ఎం సుహాసిని ఉన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

గంభీరావుపేట(సిరిసిల్ల): బీడీ కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో బుధవారం బీడీ కార్మికులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని కంపెనీలు కార్మికులకు పది రోజులు కూడా పని కల్పించడం లేదన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి



బోయినపల్లి(చొప్పదండి): బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య పేర్కొన్నారు. బోయినపల్లిలో బుధవారం బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ తొమ్మిదేళ్ల ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి కరపత్రాలు పంచి వివరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, ఎడపల్లి పరుశురామ్, సారంపల్లి రాజు, చెన్నాడి రాజిరెడ్డి, తిరుపతి, సురేశ్ పాల్గొన్నారు.

గ్రూప్-4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 50 పరీక్ష కేంద్రాలు
- 14,011 మంది అభ్యర్థులు
- టీఎస్‌పీఎస్సీ నిబంధనలు అమలు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో గ్రూప్-4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో గ్రూప్-4 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై బుధవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1న టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించే గ్రూప్-4 పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 50 పరీక్ష కేంద్రాలలో 14,011 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించాలన్నారు. కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, సీటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లను కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. సెల్‌ఫోన్లు భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలకు 15 నిమిషాల ముందు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపు జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఏఎస్పీ చంద్రయ్య, తహసీల్దార్లు, ఎంపీవోలు, చీఫ్ సూపరింటిండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం




మిషన్ పరివర్తన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ
- జిల్లా కేంద్రంలో మిషన్ పరివర్తన ర్యాలీ

సిరిసిల్లటౌన్: మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రం చేయడానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక చట్టాలను అమలు చేయిస్తున్నారన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని కోరారు. ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ డ్రగ్స్ రవాణా, సేవనంపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. గాంధీచౌక్‌లో ప్రతిజ్ఞ చేశారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, టౌన్ సీఐ అనిల్‌కుమార్, రూరల్ సీఐ ఉపేందర్, షీటీం ఏఎస్సై ప్రమీల, ఉమెన్ ఎంపవర్ కోఆర్డినేటర్ రోజా, ఏసీడీపీవో సుచరిత పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- పంచాయితీ పేరిట పైసల వసూలు చేస్తే కేసులు
- ఎస్పీ అఖిల్‌మహాజన్



అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పోలీసు అధికారులకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. బక్రీద్ పండుగతోపాటు త్వరలో నిర్వహించే గ్రూప్-4 పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాటుపై జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. గతంలో నమోదైన కేసులు, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు.. విచారణ స్థితిగతులు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసుల దర్యాప్తులు, పురోగతిపై దృష్టి సారించాలని సూచించారు. నాన్‌బెయిలబుల్ వారెంట్స్ జారీలో జాప్యం చేయొద్దన్నారు. గ్రామాలను విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ సందర్శిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. పంచాయితీలు పెడుతూ డబ్బులు వసూలుకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన 28 మందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు విశ్వప్రసాద్, నాగేంద్రచారి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు రూ.1.54 కోట్ల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 20 రోజుల్లో హుండీల ద్వారా రూ.1,54,26,225 నగదు, 402 గ్రాముల బంగారం, 13.100 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల మధ్య లెక్కింపు కొనసాగింది.

రాజన్నకు ఆషాఢం మొక్కులు

వేములవాడ: రాజన్న దర్శనానికి ఆషాఢంలోనూ భక్తులు భారీగా తరలివస్తున్నారు. బుధవారం తొగుట పీఠాధిపతి మాధవానంద స్వామి దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్ సత్కరించారు. ఏఈవోలు హరికిషన్, ప్రతాప నవీన్, జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్, అరుణ్, పీఆర్‌వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.





ఇంటింటా ఇంకుడుగుంతలు

- పారిశుధ్యం నిర్వహణకు ప్రత్యేకాధికారులు
- అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సిరిసిల్ల: జిల్లాలోని ప్రతి ఇంటికి ఇంకుడుగుంత ఉండేలా పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023పై సమీక్షించారు. జిల్లాలో పారిశుధ్యం పనుల పర్యవేక్షణకు గ్రామానికో ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతి ఊరిలోని తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి, సేంద్రియ ఎరువును తయారు చేయాలని, పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి, బట్ట సంచులను ప్రోత్సహించాలని సత్యప్రసాద్ కోరారు. క్లీన్ విలేజ్‌లో భాగంగా ప్రతి ఊరిలోనూ కమ్యూనిటీ ఇంకుడుగుంతలను మురికి కాల్వ చివరన ఏర్పాటు చేయాలని సూచించారు. జెడ్పీ సీఈవో బి.గౌతమ్ రెడ్డి, డీపీవో రవీందర్, స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్టెంట్ సురేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆసరా పింఛన్లపై విచారణ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నాగాయపల్లిలో కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారని అదే గ్రామానికి చెందిన బండి కొండయ్య కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ అధికారిగా డీఆర్‌డీఏ ఆఫీస్‌లో పనిచేస్తున్న సెర్ప్ పీడీ రవికుమార్‌ను నియమించినట్లు తెలిసింది. సోమవారంలోపు విచారణ చేపట్టి పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

సన్మానం



చంద్రమోహన్‌ను సన్మానిస్తున్న ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు

వేములవాడ: కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఎస్పీగా పదోన్నతి పొందిన జి.చంద్రమోహన్‌ను ఆలయ ఉద్యోగులు సన్మానించారు. చంద్రమోహన్ బుధవారం రాజన్నను దర్శించుకునేందుకు వచ్చారు. ఈసందర్భంగా ఆయనను సిరిగిరి శ్రీరాములు, చంద్రశేఖర్ కలిసి సన్మానించారు.

మధ్యాహ్న కార్మికుల సమస్యలు తీర్చాలి

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పులతో నెట్టుకొస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నడిగొట్టు లక్ష్మి కోరారు. ఈమేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. పెంచిన వేతనాలను ,పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్



సీజ్ చేసిన టిప్పర్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం అగ్రహారం గుట్ట ప్రాంతంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ ఏడీ సైదులు తెలిపారు. సైదులు మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా మట్టి తరలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజ్ చేసిన టిప్పర్‌ను వేములవాడ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు చెప్పారు.

కుక్కల దాడిలో దుప్పికి గాయాలు



గాయపడిన దుప్పి

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని చిక్కుడువానిపల్లి శివారులో బుధవారం దుప్పిపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. కుక్కలను దాడి నుంచి దుప్పిని రక్షించిన సమీపంలో రైతులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- జిల్హిజ్ మాసంలో చంద్ర దర్శనం తర్వాత జరుపుకునే పండుగ
- దేవుడిపై భక్తిశ్రద్ధలు ప్రకటించాలని పిలుపునిచ్చిన ప్రవక్త ఇబ్రహీం
- నేడు బక్రీద్

ఖుర్బానీ జంతువుల రక్త మాంసాలు అల్లాహ్‌కు చేరవు. కేవలం మీ భయ భక్తులు, విశ్వాసం, సమర్పణ గుణాలే చేరుతాయి.
– దివ్య ఖురాన్



కరీంనగర్‌కల్చరల్: ఇస్లాం మతాన్ని విశ్వసించే ప్రజల పండుగలలో బక్రీద్ ముఖ్యమైనది. దీన్ని త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ఇస్లాం సంప్రదాయం ప్రకారం జిల్హిజ్ మాసంలో చంద్ర దర్శనం తర్వాత బక్రీద్‌ను జరుపుకుంటారు. ఈ పండుగనే ఈద్–ఉల్–అదా అని కూడా అంటారు. ఈ సృష్టి ఎంతో అద్భుతమైనదిగా అనిపిస్తుంది. ఎంతటి మేధావికైనా అర్థం కానిది, అధ్యయనం చేయవలసింది ఇంకా ఎంతో ఉందనిపిస్తుంది. మానవుని ఆలోచన పరిధికి మించి, ఈ సృష్టిని నియంత్రించే శక్తి ఒకటి ఉందని, ఆ శక్తిని అల్లాహ్ (దైవం) అంటా మని, ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనకాడకూడదని సందేశాన్నిచ్చే పండుగ బక్రీద్. ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతి, సహనశీలత, రుజువర్తనలను తెలుపుతుంది. మానవాళికి మార్గదర్శకత్వం వహించడానికి దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన దేవుడే సకల చరాచర సృష్టికి కారకుడని, ఆయన పట్ల భక్తిశ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందవచ్చని జాతికి పిలుపునిచ్చారు.

86 ఏళ్ల వయసులో సంతానం

దేవుడొక్కడే అన్న ప్రవక్త ఇబ్రహీం వాదాన్ని వ్యతిరేకించిన వారు ఆయనపై కక్షగట్టి, శారీరకంగా, మానసికంగా హింసలు పెట్టి, తుద ముట్టించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. వృద్ధాప్యం వచ్చినా సంతానం లేకపోవడం ప్రవక్త ఇబ్రహీంను వేధించేది. సంతానాన్ని ప్రసాదించమని ఆయన నిరంతరం ఏకేశ్వరుడిని ప్రార్థించేవారు. 86 ఏళ్ల వయసులో దైవం ఒక కుమారుడిని ఇచ్చారు.

మరో పరీక్ష

ప్రవక్త ఇబ్రహీంకు దైవం మరో కఠిన పరీక్ష పెట్టారు. కలలో అందిన సూచన మేరకు ఆయన తన కుమారుడిని బలి ఇచ్చేందుకు సిద్ధమవుతారు. కుమారుడు కూడా దైవాజ్ఞను అంగీకరిస్తాడు. తండ్రి ఇబ్రహీం కుమారుడిని జుబాహ్ చేశాడు. తీరా చూస్తే కుమారుడికి బదులు అక్కడ ఒక గొర్రె జుబాహ్ చేయబడి ఉంటుంది. దైవంపై ప్రవక్త ఇబ్రహీంకు గల అచంచల భక్తి, విశ్వాసాలకు, త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు ఏటా ఈద్–ఉల్–అదా పండుగ నిర్వహించుకుంటున్నారు. బక్రీద్ రోజు గొర్రెలను బలి ఇచ్చే సంప్రదాయం కూడా పుట్టింది.

ప్రవక్త ఇబ్రహీం భక్తికి పరీక్ష

కుమారుడు పుట్టాడన్న ఆనందంలో ఓలలాడుతున్న సమయంలో దైవం ప్రవక్త ఇబ్రహీం భక్తిని పరీక్షించదలిచారు. నీ ప్రియ పుత్రుడిని మానవ మాత్రులు సంచరించని ఎడారిలో వదిలేయమని ఆజ్ఞాపించారు. పుత్రుని కంటే దైవం ఆదేశమే గొప్పదన్న విశ్వాసంతో ఇబ్రహీం తన సతీమణి బీబీ హాజిరాను, కుమారుడు ఇస్మాయిల్‌ను ఎడారిలో వదిలిపెట్టారు. తల్లీబిడ్డ ఆకలి, దప్పికలతో అలమట్టించారు. అక్కడి సఫా కొండల మధ్య నీళ్ల కోసం వెదికారు. ఇస్మాయిల్ దాహంతో గిలగిలలాడుతున్నప్పుడు అతని కాలి మడమల మధ్య ఇసుకలో గుంత ఏర్పడి, ఆ ఎడారిలో నీటి ఊట పుడుతుంది. అదే సెలయేరుగా మారింది. ఆ నీటినే పవిత్రమైన జమ్‌జమ్ పానీ అంటారు. హజ్‌కు వెళ్లిన యాత్రికులు ఆ పవిత్ర జలాన్ని సేవించి, తమ బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల కోసం తీసుకొస్తారు.

పైపులైన్ ద్వారా వంట గ్యాస్



ఆర్‌ఎఫ్‌సీఎల్ వద్ద ఐవోసీ గ్యాస్ స్టేషన్

- తుది దశకు గ్యాస్ స్టేషన్ పనులు
- ఎల్‌పీజీ ధరతో పోలిస్తే 30 శాతం తక్కువ
- రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన వారి ఇళ్లకు మీటర్ల బిగింపు
- ఆగస్టు 1 నాటికి సరఫరాకు చర్యలు



గౌతమినగర్‌లో కొనసాగుతున్న పైపులైన్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రాష్ట్రంలో తొలిసారిగా ఇంటింటికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు చేపడుతున్న పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దీన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో పెద్దపెల్లి జిల్లాలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లోని గౌతమినగర్, శాంతినగర్‌లలో ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్, సింగరేణి ఇతర ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, శాంతినగర్, గౌతమినగర్‌లో ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్ కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) వినియోగదారులకు రూ.618లతో రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఈ ఫీజు చెల్లించిన వినియోగదారుల ఇళ్లకు గ్యాస్ మీటర్లు బిగించారు. ఆగస్టు 1 నాటికి ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మూడు జిల్లాల్లో పనులు పూర్తి

రాష్ట్రంలోని గ్యాస్ ఆధారిత భారీ, చిన్న తరహా పరిశ్రమలకు పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాతో మేలు జరుగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వీటితోపాటు సీఎన్‌జీ బంకులను అందుబాటులోకి తీసుకురానున్నారు. మల్లవరం పోర్టు నుంచి పైపులైన్ ద్వారా రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలోని గ్యాస్ స్టేషన్‌కు ఇప్పటికే గ్యాస్ సరఫరా అవుతోంది. నూతనంగా నిర్మించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్టేషన్‌కు గ్యాస్ తరలింపుపై ట్రయల్ రన్ నిర్వహించారు.

లీకేజీ అవకాశాలు తక్కువ

ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌తో పోలిస్తే పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ ధర 30 శాతం వరకు తక్కువగా ఉండనుంది. పైపులైన్ ద్వారా వచ్చే గ్యాస్ బరువు తక్కువగా ఉండటంతో లీకేజీ, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు తక్కువ. వినియోగదారుల ఇళ్లకు మీటర్లు బిగించి, యూనిట్ల ఆధారంగా బిల్లు వసూలు చేస్తారు.

ఇందిరమ్మ రాజ్యాన్ని సాధిస్తాం



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇందిరమ్మ రాజ్యాన్ని సాధిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పల్లిమక్తలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు, పథకాలు దరి చేరాయన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ భరోసా కింద రైతులకు రూ.15 వేల చొప్పున అందిస్తామన్నారు. గతంలో మాదిరిగా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ.1250 నుంచి రూ.500లకు తగ్గిస్తామన్నారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, మండల నాయకులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, నగేశ్, నవీన్, అనిల్, కిషన్, దేవరాజు, నారాయణ పాల్గొన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

- ముస్తాబాద్‌లో అత్యధికం 11.2 మిల్లీమీటర్లు

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో బుధవారం చిరుజల్లులు కురిశాయి. ముస్తాబాద్ మండలంలో అత్యధికంగా 11.2 మిల్లీమీటర్ల వర్షం పడగా.. వేములవాడ రూరల్‌లో వర్షం పడలేదు. రుద్రంగిలో 1.3, చందుర్తిలో 4.1, బోయినపల్లిలో 4.1, వేములవాడలో 0.7, సిరిసిల్లలో 1.2, కోనరావుపేటలో 0.6, వీర్నపల్లిలో 0.3, ఎల్లారెడ్డిపేటలో 1.7, గంభీరావుపేటలో 7.3, తంగళ్లపల్లిలో 4.4, ఇల్లంతకుంటలో 3.0 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలో జూన్ 28వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 121.2 మిల్లీ మీటర్లు కాగా.. ఇప్పటి వరకు 32.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 73 శాతం లోటు వర్షపాతం ఉంది.



ఎల్లారెడ్డిపేటలో కురుస్తున్న వర్షం

ఎల్లారెడ్డిపేటలో అంధకారం

ఎల్లారెడ్డిపేటలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పది రోజుల క్రితం తొలకరి పలకరించినప్పటికీ తర్వాత వర్షం కురువకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ వర్షంతో అందరికి ఊరట లభించింది. వర్షం ఏకాధాటిగా కురియడంతో మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న విద్యాశాఖ



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిరిసిల్లటౌన్: విద్యాపరిరక్షణ చట్టాలను అతిక్రమిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్లకు విద్యాశాఖ కొమ్ముకాస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్ విమర్శించారు. అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిరిసిల్లలోని అంబేడ్కర్‌చౌరస్తాలో బుధవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పర్మిషన్ లేకుండా తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలతోపాటు ఇతర విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తీరుతోనే ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న సిరిసిల్ల ఎంఈవో పోస్టును వెంటనే నియమించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, నాయకులు జూలపల్లి మనోజ్‌కుమార్, సొల్లు సాయి, వేణు, తనీశ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న పెన్షనర్లు

సిరిసిల్ల: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి బుధవారం ధర్నా చేసింది. పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహితంగా వైద్యసేవలు అందించాలని, పెన్షనర్లకు రావాల్సిన రెండు కరువు భత్యం (డీఆర్) విడుదల చేయాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ రెండు వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని 2.86 లక్షల మంది పెన్షనర్లకు పెన్షన్ భవన్ నిర్మించాలని కోరారు. ఈమేరకు కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి.గంగయ్యకు వినతిపత్రం అందించారు. పెన్షనర్ల జేఏసీ నాయకులు పంజాల వెంకటేశ్వర్లు, వి.మధుకర్‌రావు, దీకొండ రాజన్న, చింతకింది జనార్దన్, ఆనందరెడ్డి, భూమయ్య, ఆనందాచారి, శంకరయ్య, దేవయ్య పాల్గొన్నారు.

ఆర్వీఎం ఆర్డర్లు సిరిసిల్లకు ఇవ్వాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: రాజీవ్ విద్యామిషన్ వస్త్రోత్పత్తి ఆర్డర్లు సిరిసిల్లకే ఇవ్వాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని బీవైనగర్‌లో గల పార్టీ ఆఫీసులో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్వీఎం వస్త్రం కొనడానికి టెండర్ వేయడాన్ని ఖండించారు. 2016 నుంచి కోటి మీటర్లకు పైగా వస్త్రాన్ని సిరిసిల్లలో తయారు చేయించగా... ఇక్కడి నేతకార్మికులకు చేతినిండా పనిదొరికిందన్నారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని కొనసాగించాలని కోరారు. నక్క దేవదాసు, గుండు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎల్ మంజూరు చేయాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: జిల్లాలో ఏర్పాటు చేసిన ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్ పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్(పరిహార సాధారణ సెలవు) మంజూరు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కు వినతిపత్రం అందించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. శ్రీసరస్వతీ అకాడమీలో శిక్షణ తీసుకుని నవోదయలో సీటు సాధించిన అద్విత్ నాయక్, జైచందులను బుధవారం అభినందించారు. అనంతరం అకాడమీ నిర్వాహకుడు దేవేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లి అక్కడే గుండెపోటుకు గురైన మండలంలోని గోపాలరావుపల్లికి చెందిన జనగం పర్శరాములు(52) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. మంత్రి కేటీఆర్ ఎంబసీకి లెటర్ రాయగా.. నెల 20 రోజుల తరువాత బుధవారం పర్శరాములు మృతదేహం గోపాల్‌రావుపల్లికి వచ్చింది. భార్య పుష్పలత, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

ఆర్భాటాలకు స్వస్తి.. సేవాబాటతో దోస్తీ

- భారీ ఖర్చులకు దూరం
- అన్నదానం..వస్త్రదానాలతో సంతృప్తి
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు
- ముందుకొస్తున్న స్థానికులు

వేములవాడ: పుట్టిన రోజు.. బారసాల.. వివాహ వార్షికోత్సవం.. వర్ధంతి.. వేడుక ఏదైనా ఘనంగా చేయడం కల్చర్‌గా మారింది. అయితే వేములవాడలో మాత్రం ఆర్భాటాలకు స్వస్తి చెప్తూ.. సేవాబాటలో వెళ్తున్నారు. వేడుక ఏదైనా పేదల మధ్య సింపుల్‌గా జరుపుకోవడం.. అన్నదానాలు చేయడం అలవాటుగా మారుతోంది. కరోనా ప్రభావంతో వచ్చిన మార్పుల్లో ఇదీ ఒకటి. తోటి వారికి చేతనైన సాయం చేయడం.. అందులోనే ఆనందాన్ని వెదుక్కోవడం కొంత ఆర్థికంగా ఉన్న వారు అలవాటు చేసుకుంటున్నారు. వేములవాడలో వీధుల్లో నివసించే వారికి అన్నదానం.. వస్త్రాలు కొనిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



❒ ఈ చిత్రంలో కనిపిస్తున్న దిడిగ సంతోష్–రోహిణి దంపతులు తమ అబ్బాయి వర్షిత్ సాయి పుట్టిన రోజును ఇంట్లో కాకుండా ఇలా పేదల మధ్య జరుపుకున్నారు. వేములవాడ పట్టణంలోని శివపురం కాంప్లెక్స్ వద్దకు చేరుకుని మై వేములవాడ ట్రస్టు ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఇలా చేయడం తమకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు.



❒ ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు ప్రతాప సువేశ్, ప్రతాప సుచేత్, దివన్నగారి శిరీష్, మనవరాళ్లు శిరీష, వాణి, సువిధ. వీరు తమ నాన్నమ్మ రాజమణి జ్ఞాపకార్థం హైదరాబాద్ నుంచి వేములవాడకు వచ్చి రాజన్న ఆలయ పరిసరాల్లో ఉండే పేదలకు అన్నదానం చేశారు.



❒ ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధులు వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన వారు. రాఘవేంద్రశర్మ తండ్రి విశ్వనాథశర్మ ఇటీవల మరణించారు. ఆయన జ్ఞాపకార్థం 50 మంది వృద్ధులకు చేతికర్రలు అందజేశారు.



❒ ఈ చిత్రంలో కనిపిస్తున్న వారంతా వేములవాడకు చెందిన స్నేహితులు. వీరి స్నేహితుడు యశ్వంత్ గతేడాది అమెరికాలో జరిగిన బోటు ప్రమాదంలో మృతిచెందాడు. మిత్రుడి యశ్వంత్ జయంతిని పురస్కరించుకొని వేములవాడలోని పేదల మధ్య కేక్ కట్ చేయడంతోపాటు అన్నదానం చేశారు.